క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు



నవాబుపేట: ఫైలేరియా వ్యాధి నివారణ కోసం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారులు విజయలక్ష్మి, నవీన్ చంద్ర తెలిపారు. సోమవారం మండలంలోని దేపల్లి, కొత్తపల్లి గ్రామాల్లోన్ని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక బృందం రక్త పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య బృందం శ్రీరాములు, శరభలింగం, వినోద్, పుష్పలత, ఆసిఫా, పుష్ప, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాసుల పంపిణీ

మిడ్జిల్: మండలంలోని వెలుగోమ్ములలో సోమవారం ఆర్టీసీ అధికారులు, సర్పంచ్ అంజమ్మ దివ్యాంగులకు రాయితీ బస్‌పాస్‌లను క్యాంప్ ఏర్పాటు చేసి అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, ఆర్టీసీ అధికారి శేఖర్‌రెడ్డి ఉన్నారు.

ఆర్గనైజింగ్ సెక్రటరీగా నర్సింహులు



నవాబుపేట: ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా నవాబుపేటకు చెందిన సింగిల్‌విండో చైర్మన్ మాడెమోని నర్సింహులును నియమించినట్లు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బండప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. నర్సింహులు ఎంపికపై మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బ్యాంగి రవీందర్, ప్రతాప్, లక్ష్మయ్యలు హర్షం వ్యక్తం చేశారు.

ప్రత్యేకాధికారిగా బాబురావు

బాలానగర్: మండల ప్రత్యేక అధికారిగా జీఎం బాబురావు బాధ్యతలు చేపట్టారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ కృష్ణారావు, డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్, ఎంపీఓ నజీర్‌అహ్మద్‌లతో సమావేశం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని బాలికల ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు.

డీసీఎంలు ఢీకొని ఇద్దరికి గాయాలు



గండేడ్: ఎదురెదురుగా రెండు డీసీఎంలు ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కడపకు చెందిన షేక్‌మస్తాన్ వలీ డీసీఎంలో సరుకుల లోడ్‌తో ముంబాయి వెళ్తున్నాడు. అదే సమయంలో నంచర్లకు చెందిన అఖిలేష్ డీజే కలిగిన డీసీఎంతో గండేడ్ వైపు నుంచి నంచర్లకు వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు అంచనపల్లి గేటు సమీపానికి రాగానే రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కడపకు చెందిన డ్రైవర్ మస్తాన్‌వలీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. కాలు పూర్తిగా విరిగిపోయింది. మరో డీసీఎం డ్రైవర్ అఖిలేష్ కూడా గాయపడ్డాడు. డీసీఎంలో ఉన్న మిగతా వారు వెంటనే 108కు సమాచారం ఇవ్వగా, మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేడు ఉపాధి పనులపై ఆడిట్

బాలానగర్: ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల వినియోగానికి సంబంధించిన రికార్డుల పరిశీలనపై మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ మీటింగ్ హాల్‌లో సోషల్ ఆడిట్ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఏపీఓ రాజశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022–2023 సంవత్సరానికి గాను మండలంలోని క్రిమిటోరియం, నర్సరీల ఏర్పాటు, సెగ్రిగేషన్ షెడ్లు, కల్లాల నిర్మాణం, పశువుల కొట్టాలు, రైతుల భూములకు ఇంటర్నల్ రోడ్ల నిర్మాణం, ఈజీఎస్, ప్లాంటేషన్ వంటి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సర్పంచ్‌కు సన్మానం

నవాబుపేట: స్థానిక గ్రామ పంచాయతీకి జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు రావడంపై నవాబుపేట సర్పంచ్ గోపాల్‌గౌడ్‌కు మండల యువజన సంఘాల నాయకులు, పంచాయతీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయనను గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ తాహేర్, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఉపసర్పంచ్ శ్రీశైలం, వార్డు సభ్యులు నర్సింహులు, గిరి, యువజన సంఘాల నాయకులు శ్రీనివాస్, సంపత్, ప్రకాష్, సుధాకర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సంక్షేమమే ధ్యేయం

మంత్రి శ్రీనివాస్‌గౌడ్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ముఖ్య నాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పార్టీ ప్రతిష్టను మరింత పెంచేందుకు కార్యకర్తలు, నాయకులు నిరంతరం కృషిచేయాలన్నారు. పెద్ద నాయకుడి నుంచి చిన్న కార్యకర్తల వరకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. వార్డుల్లో ప్రజా సమస్యలపై నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పార్టీ జిల్లా పరిశీలకుడు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిని చూసి ప్రజలు ఓటు వేయాలన్నారు. పెద్ద పరిశ్రమలు ఇక్కడికి వస్తున్నాయని వివరించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రహమాన్, నాయకులు వెంకటయ్య, శాంతయ్య, గణేష్, గిరిధర్‌రెడ్డి, శివరాజు, వినోద్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

అండగా ఉంటా..

భర్త చనిపోయిన నిర్మల అనే బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త, ఆమె పిల్లలు, క్యాన్సర్‌తో బాధపడుతున్న పార్టీ కార్యకర్త శ్రీనివాసులు కుటుంబానికి అండగా ఉంటానని మంత్రి తెలిపారు. సోమవారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో శ్రీనివాసులు ఆయన భార్య పున్నమ్మ, పలువురు బాధితులకు భరోసా ఇచ్చి వారితో కలిసి భోజనం చేశారు.

సోదరాభావంతో మెలగాలి..

స్టేషన్ మహబూబ్‌నగర్: బంగారు తెలంగాణ రియల్ ఎస్టేట్స్ మార్కెటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఎర్రసత్యం చౌరస్తాలో ముస్లింలకు ఇఫ్తారు విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తారు విందులో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. అంతకుముందు బంగారు తెలంగాణ రియల్ ఎస్టేట్స్ మార్కెటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, ముడా డైరెక్టర్ సాయిలు, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అన్సారీ హుస్సేన్, జిల్లా అధ్యక్షుడు రవికిరణ్, బాబునాయక్, శ్రీనివాసులు, ప్రమోద్‌కుమార్, జగ్వీర్‌సింగ్, భానుప్రతాప్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి

పరిగి ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

గండేడ్/మహమ్మదాబాద్: గ్రామాల్లో ఏళ్ల తరబడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిస్తూ అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతుందని పరిగి ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గండేడ్ మండలంలోని మల్లయ్య చెరువు వద్ద రూ.87లక్షలతో ఎఫ్‌డీఆర్ పథకం కింద మంజూరైన బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతర్ గంగ లింగేశ్వర స్వామి ఆలయం వద్ద రూ.10లక్షలతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. అనంతరం మహ మ్మదాబాద్ మండలం అన్నారెడ్డిపల్లి వాగు వద్ద ఎంఎంఆర్ గ్రాంట్ కింద నిర్మించ తలపెట్టిన బ్రిడ్జి ని ర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మల్లయ్య చెరువు అలుగు పారిన ప్రతిసారి రెండు తండాలు, మరో రెండు గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వర్షాలు పడితే రాకపోకలు నిలిచిపోయి అవస్థలు పడ్డారని గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల అవసరాలు గుర్తించిందని, శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తుందని తెలిపారు. అన్నారెడ్డిపల్లిలో సైతం వాగు ఉధృతంగా పారి ఎన్నోసార్లు రాకపోకలు నిలిచిపోయాయని, ఈ రెండు ప్రధాన సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ మాధవి, వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ రూపేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మి, నర్సింహారెడ్డి, సోనిబాయి, చంద్రకళ, ఎంపీటీసీ లక్ష్మి, మండలాల అధ్యక్షులు పెంట్యానాయక్, భిక్షపతి, పీఏసీఎస్ డైరెక్టర్లు రాంరెడ్డి, వెంకటయ్య పాల్గొన్నారు.



మల్లయ్య చెరువు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

నవాబుపేట: కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో నవాబుపేటకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. సోమవారం షాద్‌నగర్‌లో జరిగిన కరాటే రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు, సిల్వర్ మెడల్స్‌ను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, సర్పంచ్ గోపాల్‌గౌడ్, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, కరాటే మాస్టర్ ఆనంద్, బాల్‌రాజ్ అభినందించారు.

అంబలి కేంద్రం ప్రారంభం

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి సప్తాహ మహోత్సవాలను పురస్కరించుకుని కొండాపురం రాంచంద్రయ్య కుమారుడు కె.రఘువీర్ ఆధ్వర్యంలో అంబలి కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. వారం రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు వచ్చే భక్తులకు అంబలిని అందించడానికి ఏర్పాటు చేసినట్లు దాత రఘువీర్ తెలిపారు.

అఖండ భజన

దేవరకద్ర: మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్యస్వామి ఆలయాల్లో నిత్యపూజలు సేవా కార్యక్రమాలతో పాటు అఖండ భజనలు కొనసాగుతున్నాయి. సోమవారం పూజల అనంతరం అన్నప్రసాదాల పంపిణీ నిర్వహించారు.

పీహెచ్‌సీలకు కొత్త కళ



పాలమూరు: జిల్లాలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు సబ్‌సెంటర్లు, అర్బన్ హెల్త్ సెంటర్లలో కొత్త కళ కనిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 87సబ్ సెంటర్లు, 17ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఐదు అర్బన్ హెల్త్ సెంటర్లకు నూతనంగా రంగులు వేస్తున్నారు. చాలా రోజులుగా రంగులు లేకపోవడంతో పాతబడినట్లు కన్పిస్తున్న భవనాలు కొత్తగా రంగులు వేయడం వల్ల కొత్తగా అనిపిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో చాలా వరకు భవనాలకు రంగులు వేయడం పూర్తిగా కొన్నింటికి వేస్తున్నారు.

కుక్కలదాడిలో మేకపిల్లల మృతి

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని మాచన్‌పల్లి తండాలో కుక్కల దాడిలో తొమ్మిది మేకపిల్లలు మృతిచెందాయి. తండాకు చెందిన మేఘ్యానాయక్ అనే రైతు సోమవారం ఇంటి వద్ద మేకపిల్లలు కట్టి మిగతా మేకలను మేత కోసం అడవికి తీసుకెళ్లాడు. కుక్కలు మేకపిల్లలపై దాడి చేసి చంపేశాయి. రూ.55వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

క్రేన్ డ్రైవర్లపై దాడి: కేసు నమోదు

రాజాపూర్: రోడ్డు పక్కన ఉన్న క్రేన్‌ను పక్కకు తీయాలంటూ కొందరు క్రేన్ డ్రైవర్లపై దాడి చేయడంతో తీవ్ర రక్తగాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముదిరెడ్డిపల్లికి చెందిన సుదర్శన్‌కు రెండు క్రేన్‌లు ఉన్నాయి. ఆదివారం రాత్రి పోలేపల్లి సెజ్‌లో నుంచి జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డులో వస్తుండగా, రాజాపూర్ గ్రామానికి చెందిన ఓ టిప్పర్‌తో పాటు టిప్పర్ వెనకాల ఉన్న మరికొందరు సైడ్ ఎందుకు ఇవ్వరంటూ క్రేన్ డ్రైవర్లు గంగాసాగర్, దీపక్‌పాల్‌లపై అకారణంగా దాడిచేశారు. దీంతో ఇద్దరు డ్రైవర్లపై దాడి చేయడంతో తలలు పగిలాయి. దీంతో క్రేన్ యజమాని సుదర్శన్ దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న రాజాపూర్‌కు చెందిన పల్లెరాజు, రామకృష్ణ, పల్లె శ్రీను, పల్లె తిరుపతయ్యతో పాటు మరికొందరు సుదర్శన్‌పై దాడి చేశారు. సుదర్శన్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

హన్వాడ: కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పల్లెమోని వెంకటమ్మ సూచించారు. మండలంలోని పల్లెమోనికాలనీ గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్త చెరువుతండాలో కంటివెలుగు కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు, అవసరమైన వారికి కళ్ల అద్దాలు వైద్యులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.రోజ, ఎండీ గుల్‌నాజ్, ఏపీఎం విష్ణుచారి, ఉపసర్పంచ్ లచ్చమ్మ ఊక్యానాయక్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని కోటకదిరలో వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వెలుగు శిబిరం సోమవారంతో ముగిసింది. సర్పంచ్ మల్లు రమ్య శిబిరంలో డాక్టర్ మాధవి, డాక్టర్ హుస్సేన్, పద్మ, రేఖారెడ్డి, సావిత్రితో పాటు ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ సభ్యులకు మెమెంటోలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో రైతుబంధు మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ మస్తాన్, ఉప సర్పంచ్ మునీర్, పంచాయతీ కార్యదర్శి మాధవి పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

రాజగోపురంపై కలశాల ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి

పూజలు చేసిన జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం గ్రామ సమీపంలో వెలసిన కురుమూర్తి స్వామి ఆలయ నూతన రాజగోపురంపై కలశాల ప్రతిష్ఠాపన కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలశాలను రాజగోపురం వద్దకు తీసుకవచ్చి ప్రతిష్ఠించారు. రాజగోపురం ద్వారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయల చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఆలయ ఈఓ మధనేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వరి పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ..

బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కురుమూర్తి స్వామి ఆలయ ప్రాంగణంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డితో కలిసి 129 మంది లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం చిన్నచింతకుంట ఊకచెట్టు వాగుపై నిర్మిస్తున్న కాజ్‌వే నిర్మాణం పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించాలి

మహబూబ్‌నగర్ రూరల్: మతోన్మాద బీజేపీ కార్పొరేట్ విధానాలను ప్రతిఒక్కరు వ్యతిరేకించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకట్రాములు అన్నారు. ఆ పార్టీ చేపట్టిన జన చైతన్య యాత్ర సోమవారం మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని మాచన్‌పల్లి, రామచంద్రాపూర్, మనికొండ మీదుగా కోయిలకొండ మండలంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ కార్పొరేట్ విధానాలతో దేశ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బీజేపీ అధికారంలోకి రాకముందు రూ.450 ఉన్న వంట గ్యాస్ తొమ్మిదేళ్లలో రూ.1,150కి చేరిందని మండిపడ్డారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయని, ఎన్నికల ముందు మోదీ ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చలేదని విమర్శించారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న మోదీ ప్రభుత్వ రంగాలను ప్రైవేట్‌కు అప్పజెప్పి ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారని ఆరోపించారు. ఒకపక్క ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ అదానీ, అంబానీలకు ప్రజాధనాన్ని దోచిపెడుతున్నారని దుయ్యబట్టారు. దేశంలో పేదలకు వరంగా ఉన్న ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వాన్ని నమ్మేలా ప్రజలు లేరని, బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియపరిచి చైతన్యం చేయడమే ఈ యాత్ర ఉద్దేశం అన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, సాగర్, రమణ, నాయకులు ధర్మానాయక్, విజయ్, రాములు, కిల్లె గోపాల్, చంద్రకాంత్, కురుమూర్తి, మోహన్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకట్రాములు

రైతులకు అండగా ప్రభుత్వం

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే సి.లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని నసరుల్లాబాద్‌లో రైతుబీమా పథకం కింద సుజాతకు రూ.5లక్షల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అన్నివిధాలా అండగా ఉంటుందని అన్నారు. గతంలో రైతులు ఏకారణంగానైనా మృత్యువాత పడితే ప్రభుత్వం నుంచి ఏ చిన్న సాయం కూడా అందే పరిస్థితి లేదని అన్నారు. సీఎం కేసీఆర్ రైతు కుటుంబాలను ఆదుకోవాలన్న సదుద్దేశంతో రైతుబీమా, పెట్టుబడి సాయంగా రైతుబంధు తదితర అనేక పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రణీల్‌చందర్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిడ్జిల్: కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని వాడ్యాల్‌లో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. కంటి వెలుగు ద్వారా ఎంతో మంది నిరుపేదలకు ఉపయోగం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రెడ్డి, పాండు, బాలు, సుదర్శన్, శ్రీను, భీంరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

అడ్డాకుల: మండలంలోని కందూర్ సమీపంలో స్వయంభూగా వెలిసిన రామలింగేశ్వరస్వామి ఆలయంలో నిత్య పూజలు కొనసాగుతున్నాయి. స్వామి వారి బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాత ఉగాది వరకు జాతర కొనసాగింది. ఈనెల 30వరకు జాతరను కొనసాగించాలని నిర్ణయించిన నేపథ్యంలో మరో రెండు రోజుల పాటు జాతర కొనసాగనుంది. శ్రీరామనవమి రోజు ఆలయంలో కార్యక్రమం ముగిసిన తర్వాత ప్రధాన ఆలయంలోని స్వామి వారి వెండి ముఖం, ఇతర అలంకరణను తీసి వాటిని ఊరేగింపుగా గ్రామానికి తరలించనున్నారు. ప్రస్తుతం స్వామి వారికి అర్చకులు నిత్య పూజలు చేసి మహా మంగళహారతి ఇస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి వస్తున్న భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



మహా మంగళహారతి ఇస్తున్న అర్చకుడు

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అంగన్‌వాడీ టీచర్లు

జడ్చర్ల: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఐసీడీఎస్ సీడీపీఓ మెహరున్నిసా బేగం తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్ ఉర్దూ మీడియం పాఠశాలలో పోషణపక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలు, పండ్లు, కూరగాయలు తదితర పోషక ఆహారానికి సంబంధించిన వంటకాలను ప్రదర్శించారు. గర్భిణులు, బాలింతలు ప్రత్యేకంగా పోషక ఆహారాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చిన్నపిల్లల్లో పోషకాహార సమస్యలు ఏర్పడి అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఉంటుందని, తల్లులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, భాగ్యలక్ష్మి, అలివేలు, శ్రీలత, భారతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: పిల్లలకు పోషకాలతో కూడిన బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలని సీడీపీఓ ఎల్.శాంతిరేఖ సూచించారు. సోమవారం మండలంలోని మనికొండ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాల ప్రాముఖ్యతను పిల్లల తల్లులకు వివరించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని అన్నారు. అనంతరం పోషణ అభియాన్‌పై చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలానగర్: పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత అన్నారు. సోమవారం మండలంలోని ఉడిత్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు పౌష్టికాహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.

దేవరకద్ర: పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఎదగడానికి అవకాశం ఉంటుందని సీడీపీఓ శైలశ్రీ తెలిపారు. సోమవారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసన్న, గీత, పార్వతమ్మ పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పాదపూజ



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని బీసీ గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. పదో తరగతి విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలను కడిగి పూజలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం



సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేవైఎం నాయకులు

రాజాపూర్: నిరుద్యోగులు, యువకుల జీవితాలతో చెలగాటమాడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని బీజేవైఎం నాయకులు ఆనంద్, ఆదిత్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభ్యర్థులు ఎంతో కష్టపడి పరీక్షలకు సిద్ధమైతే పేపర్‌లీక్‌లతో వారి జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. వెంటనే లీకేజీ ఘనటలో బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సురెందర్‌గౌడ్, తిరుపతి, ఆంజనేయులు, ఆదిత్య, వేణు, లక్ష్మీనారాయణ, రాము పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించే వరకు పోరాటం చేస్తాం

పాలమూరు: పాత పాలమూరు సమీపంలో ఉన్న బ్రిడ్జి నిర్మించాలని బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధర్నాకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ధర్నాకు వెళ్తున్న బీజేపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కలెక్టర్ జి.రవినాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి, నాయకుడు ఎన్పీ వెంకటేష్ మాట్లాడుతూ పాత పాలమూరు వద్ద గల బ్రిడ్జి పూర్తిగా శిథిలావస్థలోకి చేరిందని, నిర్మించే వరకు పోరాడుతామన్నారు. ఎన్ని అరెస్టులు చేసినా భయపడేది లేదని, పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలను ఎత్తి చూపేహక్కు కూడా ప్రతిపక్ష పార్టీలకు లేకుండాపోయిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంజయ్య, శేరిపాండురంగారెడ్డి, నారాయణ యాదవ్, కుమార్, సంపత్, విజయ్, సత్యం పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు